




PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత

JYYOTHI SHWETHA

దినపత్రిక

హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 26 ॥గురువారం ॥ 25-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-




ఫోక్ క్వీన్ నాగదుర్గ టాలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎంట్రీ



## ఖమేనీ అంత్యక్రియలకు మోడీకి పిలుపు

**జూలై 5 నుంచి 9 వరకు అంత్యక్రియలు**

**న్యూఢిల్లీ, :**

అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన సం యుక్త దాడుల్లో మృతి చెందిన ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియకు ఆ దేశం ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే నెల 5 నుం చి 9 వరకు ఖమేనీ అంత్యక్రియలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. తొలుత టెహ్రాన్, (మిగతా 2వ పేజీలో)

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట



**హైదరాబాద్, జూన్ 24 :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. 2019 హుజూర్‌నగర్ అసెం బ్లీ ఉప ఎన్నికల ప్రచార సమయంలో నమోదైన ఐదు కేసులను తెలంగాణ హైకోర్టు బుధవారం కొట్టివేసింది. ఈ కేసుల నుంచి తనను విముక్తు డిని చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయ స్థానం ఈ మేరకు తీర్పు వెలువరించిం ది. 2019లో జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికల సమయంలో కాంగ్రెస్ (మిగతా 2వ పేజీలో)



# తుంగభద్ర జలాల్లో తెలంగాణ వాటాపై సమీక్ష

**కేంద్ర ప్రభుత్వంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**ఆర్డీఎస్ ఆధునికీకరణ పనులు వేగవంతం చేయాలని నిర్ణయం**

**జోగులాంబ గద్వాల జిల్లాకు నీటి భద్రతపై ప్రత్యేక దృష్టి**

**హైదరాబాద్, జూన్ 24 :**

తుంగభద్ర డ్యామ్, నది ప్రవాహం నుంచి తెలంగాణకు రావాల్సిన నికర వాటా జలాల వినియోగానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. తుంగభద్ర ప్రాజెక్టు, రాజోలిబండ డైవర్షన్ స్కీం (ఆర్డీఎస్), అంతర్రాష్ట్ర జల వివాదాలపై జలసౌధలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన ఈ మేరకు అధికారులకు దిశానిర్దేశం చేశారు. తుంగభద్ర నుంచి (మిగతా 2వ పేజీలో)



## ఎస్టీ రిజర్వేషన్ల స్వర్ణోత్సవాలు

- ముఖ్యమంత్రిని కలిసిన బస్సు యాత్ర ప్రతినిధులు
- ఇందిరమ్మ ఆశీర్వాద యాత్ర లక్ష్యాలను వివరించిన నేతలు
- లంబాడి, ఎరుకల, యానాది తెగల రిజర్వేషన్లకు 50 ఏళ్లు

**హైదరాబాద్, జూన్ 24 :**

తెలంగాణలో లంబాడి, ఎరుకల, యానాది తెగలకు రిజర్వేషన్లు కల్పించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించనున్న స్వర్ణోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు వేగం పుంజుకున్నాయి. ఈ సందర్భంగా చేపట్టనున్న ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని కలిసి కార్యక్రమ వివరాలను తెలియజేసింది. బస్సు యాత్ర ఉద్దేశాలు, స్వర్ణోత్సవాల నిర్వహణ, గిరిజన సమాజంలో (మిగతా 2వ పేజీలో)

**లోపలి పేజీల్లో..**



ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి **ఒలింపిక్ డే రన్ దోహదం**

ఎమ్మెల్యే చింత ప్రభాకర్




**నాలుగు నెలల కనిష్టానికి క్రూడ్ ఆయిల్ ధరలు**



## సెనేట్ తీర్మానంపై ట్రంప్ ఆగ్రహం

**ట్రంప్‌కు సెనేట్ గట్టి షాక్**

**ఇరాన్ వ్యవహారంలో అమెరికాలో రాజకీయ దుమారం**

**న్యూఢిల్లీ, :**

ఇరాన్ పై అమెరికా చేస్తున్న సైనిక చర్యల పై సెనేట్ కీలక తీర్మానం చేసి.. అధ్యక్షుడు ట్రంప్‌కు గట్టి షాక్ ఇచ్చిన విషయం తెలిసి ందే. దీంతో సెనేట్ నిర్ణయంపై అద్యక్షుడు ట్రంప్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇరాన్ పై తన సైనిక అధికారాలను కట్టడి చేస్తూ అమెరికా సెనేట్ 'వార్ పవర్స్ యాక్ట్' తీర్మానాన్ని ఆమోదించడంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'ట్రూత్ సోషల్' వేదికగా సెనేట్ నిర్ణయాన్ని,దానికి మద్దతుగా ఓటేసిన నలుగురు రిపబ్లికన్ సొంత పార్టీ నేతలను ఆయన తీవ్ర పదజాలంతో దుయ్యబట్టారు. (మిగతా 2వ పేజీలో)



## ఒక్కటైన 31 జంటలు

**వరంగల్, జూన్ 24**

వరంగల్ జిల్లాలో శివానందమూర్తి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత సామూహిక వివాహాలు కనుల పండువలా జరిగాయి. వరంగల్ ములుగురోడ్డులోని శివానందగురు సప్తధామంలో జరిగిన సామూహిక వివాహాల్లో వివిధ జిల్లాల నుంచి 31 జంటలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఒక్కో జంటకు బంగారు పుస్తెలు, వెండి మెట్టెలు, పట్టువస్త్రాలు, పూజా సామగ్రిని ఉచితంగా అందించారు. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక భారం తగ్గించేందుకే సామూహిక వివాహాలు నిర్వహించినట్లు శివానందమూర్తి ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి 19 మంది గిరిజన జంటలు, నర్సంపేట నుంచి 7 జంటలు, వరంగల్ నుంచి 5 జంటలు పాల్గొన్నట్లు వెల్లడించారు. వనవాసీ కల్యాణ పరిషత్ జాతీయ అధ్యక్షుడు రామచంద్రయ్య, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ట్రస్టీలు బండారు సాయినారాయణ, మాదారపు సదాశివుడు, వెంకటరమణ పాల్గొన్నారు.

# నేటి రాశి ఫలాలు

**మేషం :** శుభఫలితాలు కనిపిస్తున్నాయి. ప్రారంభించిన పనులు సాఫీగా పూర్తవుతాయి. మీ నిర్ణయాలు విజయానికి దారి తీస్తాయి. కుటుంబ సభ్యుల సహకారం లభిస్తుంది. గురు ధ్యానం శుభప్రదం.

**వృషభం :** అనుకూలమైన రోజు. పనుల్లో ఆశించిన పురోగతి ఉంటుంది. దైవబలం మీకు తోడ్పడుతుంది. అనుకున్న కార్యక్రమాలు సకాలంలో పూర్తవుతాయి. శ్రీలక్ష్మీదేవిని దర్శించుకోవడం శ్రేయస్కరం.

**మిథునం :** చక్కని ఫలితాలు పొందుతారు. ప్రారంభించిన పనులు విజయవంతం అవుతాయి. తోటివారి ప్రోత్సాహం లభిస్తుంది. గౌరవం, గుర్తింపు పెరుగుతాయి. సూర్య నమస్కారాలు చేయండి.

**కర్కాటకం :** పట్టుదలతో ముందుకు సాగితే మంచి ఫలితాలు పొందుతారు. ప్రణాళికాబద్ధంగా పనులను పూర్తి చేయండి. దగ్గర వారి సహకారం లభిస్తుంది. దైవనామస్మరణ మనోబలాన్ని పెంచుతుంది.

**సింహం :** ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి. ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానసిక ప్రశాంతతను ఇస్తాయి. కుటుంబ విషయాల్లో సహనంతో వ్యవహరిస్తే మేలు జరుగుతుంది. నవగ్రహ ధ్యానం శుభప్రదం.

**కన్య :** అనుకూల ఫలితాలు కనిపిస్తున్నాయి. పనుల్లో పురోగతి ఉంటుంది. ఒక శుభవార్త ఆనందాన్ని కలిగిస్తుంది. ఖర్చుల్లో కాస్త నియంత్రణ పాటించండి. శ్రీఆంజనేయస్వామి ఆరాధన మేలు చేస్తుంది.

**తుల :** శుభప్రదమైన రోజు. ఉద్యోగ, వ్యాపారాల్లో అభివృద్ధి కనిపిస్తుంది. బాధ్యతలను సమర్థంగా నిర్వహించి ప్రశంసలు పొందుతారు. మానసిక ధైర్యం పెరుగుతుంది. శ్రీసుబ్రహ్మణ్య స్వామిని ఆరాధించండి.

**వృశ్చికం :** సహనంతో వ్యవహరిస్తే మంచి ఫలితాలు పొందుతారు. బంధువులతో సౌమ్యంగా మాట్లాడండి. పనుల్లో వచ్చిన సవాళ్లను విజయవంతంగా అధిగమిస్తారు. ఖర్చులను నియంత్రించండి. నవగ్రహ శ్లోకాలు చదవండి.

**ధనుస్సు :** విజయం మీకు అనుకూలంగా ఉంది. ప్రారంభించిన పనులు ఆశించిన విధంగా పూర్తవుతాయి. ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి. విష్ణు సహస్రనామం పారాయణం శుభప్రదం.

**మకరం :** శుభఫలితాలు లభిస్తాయి.పనులు అనుకున్న సమయానికి పూర్తవుతాయి. ఆర్థికంగా లాభం ఉంటుంది. ఆనందకరమైన వాతావరణం నెలకొంటుంది. ఖర్చుల్లో జాగ్రత్త పాటించండి. శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించండి.

**కుంభం :** అభివృద్ధికి అనుకూలమైన రోజు. ఉద్యోగ, వ్యాపారాల్లో మంచి పురోగతి ఉంటుంది. శుభవార్తలు మీ ఉత్సాహాన్ని పెంచుతాయి.పెద్దల సలహా మీ విజయానికి దోహదపడుతుంది. శ్రీలక్ష్మీ అష్టోత్తరం చదవండి.

**మీనం :** పట్టుదలతో పని చేస్తే విజయాలు మీవే. తొందరపాటు నిర్ణయాలకు దూరంగా ఉండి ఆలోచించి అడుగులు వేయండి. కుటుంబ సభ్యుల సలహా మేలు చేస్తుంది. నవగ్రహ ధ్యానం శుభఫలితాలను అందిస్తుంది.0



# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ తరఫున రేవంత్ రెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అప్పట్లో మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న ఆయనపై ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన ఆరోపణలు వచ్చాయి. రిటర్నింగ్ అధికారి అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహించారనే అభియోగాలతో పోలీసులు పలు కేసులు నమోదు చేశారు.తనపై నమోదైన కేసులు చట్టపరంగా నిలబడవని పేర్కొంటూ రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కేసుల కొట్టివేత కోసం ఆయన ఐదు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై వాదనలు విన్న న్యాయస్థానం గత జూన్ 18న తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా బుధవారం తీర్పు వెల్లడించిన హైకోర్టు, అన్ని కేసులను కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. కేసులలో కొనసాగుతున్న న్యాయపరమైన ప్రక్రియను రద్దు చేస్తూ రేవంత్ రెడ్డికి ఉపశమనం కల్పించింది. దీంతో చాలా కాలంగా కొనసాగుతున్న ఈ వ్యవహారానికి ముగింపు లభించినట్లైంది.ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ఈ కేసులు రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారాయి. హైకోర్టు తాజా తీర్పుతో ముఖ్యమంత్రిపై ఉన్న న్యాయపరమైన భారం తొలగిపోయిందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. ఎన్నికల నిబంధనల అమలు, ప్రచార అనుమతులు, ప్రజా సమావేశాల నిర్వహణ వంటి అంశాలపై ఈ తీర్పు ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం ఈ కేసులకు సంబంధించిన అన్ని న్యాయ ప్రక్రియలు ముగిసినట్లు స్పష్టమైంది.

# తుంగభద్ర జలాల కోసం కేంద్రం జోక్యం చేసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణకు హక్కుగా 15.9 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా ప్రస్తుతం అయిదు నుంచి ఆరు టీఎంసీలకు మించి అందడం లేదని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్డీఎస్ పరిధిలో జోగులాంబ గద్వాల జిల్లాలోని 75 గ్రామాల్లో సుమారు 83,987 ఎకరాల ఆయకట్టుకు నీరు అందాల్సి ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో నీటి లభ్యత లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు భాగస్వాములుగా ఉన్న నేపథ్యంలో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో తుంగభద్ర బోర్డును మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. మూడు రాష్ట్రాల మధ్య సమన్వయం పెంచి నీటి వినియోగం సమర్థవంతంగా జరిగేలా కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.ఆర్డీఎస్ ఆనకట్ట భద్రతపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు.ఆనకట్ట ప్రమాదకర పరిస్థితుల్లో ఉందని,భద్రతా పరమైన పనులను అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆర్డీఎస్ ఆధునికీకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రూ.59 కోట్లు డిపాజిట్ చేసినప్పటికీ ప్యాకేజీ-1, ప్యాకేజీ-2 పనులు ఇంకా ప్రారంభం కాలేదని అధికారులు వివరించారు.ఆర్డీఎస్ వద్ద తెలంగాణ వైపు భారీగా పూడిక పేరుకుపోవడం వల్ల నీటి మళ్లింపు ఆశించిన స్థాయిలో జరగడం లేదని ఇంజనీర్లు తెలిపారు.2004లో నిపుణుల కమిటీ చేసిన పూడికతీత, ఇతర సాంకేతిక సిఫారసులు ఇప్పటికీ అమలుకాలేదని సమావేశంలో చర్చించారు.పూడిక తొలగింపు పనులను వెంటనే చేపట్టాలని, ఇందుకు కర్ణాటక సహకారం కూడా కోరాలని నిర్ణయించారు.తుంగభద్ర ఎత్తిపోతల పథకం ద్వారా సాధ్యమైనంత ఎక్కువ నీటిని వినియోగించుకునే మార్గాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.తుమ్మిళ్ల ప్రాజెక్టుకు కీలకమైన మల్లమ్మకుంట బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచి పనులను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎస్టీ రిజర్వేషన్ల స్వర్ణోత్సవాలకు సన్నాహాలు

(మొదటి పేజీ తరువాయి)



అవగాహన కల్పించేందుకు చేపట్టనున్న కార్యక్రమా లను ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ఎస్టీలకు రిజర్వేషన్లు అమలులోకి వచ్చి ఐదు దశాబ్దాలు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గిరిజన వర్గాల సామాజిక, విద్యా, ఆర్థిక అభివృద్ధిలో రిజర్వేషన్ల పాత్ర ఎంతో కీలకమైందని ప్రతినిధులు పేర్కొన్నారు. స్వర్ణోత్సవాల సందర్భంగా గిరిజనుల చరిత్ర, సాధించిన పురోగతి, భవిష్యత్ లక్ష్యాలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు బస్సు యాత్ర ఉపయోగపడుతుందని వివరించా రు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతినిధుల నుంచి యాత్రకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన సంక్షేమం, సామాజిక న్యాయం అంశాల్లో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నట్లు సమాచారం. గిరిజన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది.ముఖ్యమంత్రిని కలిసిన వారిలో లోక్‌సభ సభ్యుడు బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యే బాలు నాయక్, మాజీ ఎంపీ రవీంద్ర నాయక్‌తో పాటు పలువురు ప్రతినిధులు ఉన్నారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర ద్వారా గిరిజన హక్కులు, సంక్షేమ కార్యక్రమాలు, రిజర్వేషన్ల ప్రాధాన్యంపై విస్తృత ప్రచారం చేపట్టనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. స్వర్ణోత్సవ వేడుకలను గిరిజన సమాజ చరిత్రలో ఒక ప్రత్యేక ఘట్టంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

## మహిళల సాధికారతకు సమిష్టి
# కృషి అవసరం

హైదరాబాద్, జూన్ 24 : మహిళల సాధికారత కోసం ప్రభుత్వం, కుటుంబం, సమాజం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన వెటా ఇండియా మహిళా సాధికారత కార్యక్రమంలో పాల్గొని ఆమె ప్రసంగిం చారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మహిళలు ఎంత ప్రతిభ కనబ రిచినా, ఎంత కష్టపడ్డా సమాజంలో అనేక అడ్డంకులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఉద్యోగాలు, పదోన్నతులు, నాయకత్వ స్థానాల్లో మహిళలకు సమాన అవకాశాలు లభించడం లేదని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న వివక్షను తొలగించేందుకు అందరూ కృషి చేయాల్సి న అవసరం ఉందన్నారు. మహిళలు తమ లక్ష్యాలను నిర్దేశించుకున్న తర్వాత వెనక్కి తగ్గకుండా ముందుకు సాగాలని ఆమె సూచించారు. విజయాన్ని సాధించాలంటే ఆత్మవిశ్వాసం, పట్టుదల ఎంతో ముఖ్యమని చెప్పారు. మహిళలు ఉద్యోగాలు చేయడమే కాకుండా ఇతరులకు ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షి ంచారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన విషయాన్ని గుర్తు చేసిన కవిత, అయినప్పటికీ ఆ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ కావడం లేదని అన్నారు. దీనికి కుటు ంబాలు, సమాజం నుంచి తగిన ప్రోత్సాహం లేకపోవడమే కారణమని అభిప్రాయపడ్డారు.రాజకీయాలు, న్యాయరం గం,పరిపాలన సహా అనేక రంగాల్లో మహిళల ప్రాతినిధ్య ం ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళలు ప్రతిభ చూపుతున్నప్పటికీ ఉన్నత స్థాయిలకు చేరుకునే అవకాశాలు పరిమితంగానే ఉన్నాయని చెప్పా రు.సమాన అవకాశాలు కల్పించకుండా మహిళా సాధికా రత సాధ్యం కాదన్నారు. సోషల్ మీడియా ప్రభావం పెరు గుతున్న ఈ కాలంలో యువత ఆత్మవిశ్వాసంతో ముందు కు సాగాలని కవిత సూచించారు. మహిళలపై ఉన్న పాత అభిప్రాయాలు, సామాజిక పరిమితులను అధిగమించి లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో మార్పు ఒక్క రోజులో రాదని, ఆడ-మగ అనే తేడా లేకుండా అందరూ కలిసి పనిచేసినప్పుడే మహి ళా సాధికారత నిజంగా సాధ్యమవుతుందని అన్నారు.

# సెనేట్ తీర్మానంపై ట్రంప్ ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

తాను ఇరాన్‌ను పూర్తిగా కోలుకోలేని దెబ్బతీసి మన దారికి తెచ్చుకున్నానని, దశాబ్దాల తర్వాత మొదటిసారి వారు అమెరికాను,దేశ అధ్యక్షు డిగా తనను గౌరవిస్తున్న తరుణంలో సెనేట్ ఏ మాత్రం సమయం కాని సమయంలో ఈ అర్థం లేని ఓటింగ్‌ను నిర్వహించిందని ట్రంప్ మండిపడ్డారు.ప్రపంచంలోనే నెం బర్ వన్ ఉగ్రవాద స్పాన్సర్ అయిన ఇరాన్‌కు అనుకూలంగా ఈ తీర్మానం చేయడం ద్వారా సెనేట్ నేరుగా శత్రువు కు మేలు చేసిందని ఆయన ఆరోపించారు.ఈ తీర్మానానికి మద్దతుగా నిలిచిన నలుగురు రిపబ్లికన్ సెనేటర్లను 'లూజర్ల'గా అభివర్ణించిన ట్రంప్, వారు ప్రతిపక్ష డెమొక్రాట్లతో చేతులు కలపడం వల్లే ఇరాన్ ఇప్పుడు తమ ప్రతినిధులను ఈ ఓటింగ్ అర్థం ఏంటని ప్రశ్నిస్తోందని పేర్కొన్నారు. ఈ పరిణామాల వల్ల అంతర్జాతీయంగా దేశ అధ్యక్షుడిగా తన పనిని మరింత కష్టతరం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ తాము అనుకున్న లక్ష్యాన్ని ఎలాగోలా పూర్తి చేస్తానని, ఎందుకంటే తాను ఎప్పుడైనా అనుకున్న పనిని సాధించి తీరుతానని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్‌లో ఇరాన్‌తో శాంతి చర్చలు ముగింపు దశకు వస్తున్న తరుణంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర సంచలనంగా మారాయి.

# నాలుగు నెలల కనిష్ఠానికి క్రూడ్ ఆయిల్ ధరలు

న్యూఢిల్లీ, జూన్ 24 : అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు గణనీయంగా తగ్గుతూ నాలుగు నెలల కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఇటీవల వరకు ప్రపంచ మార్కెట్లను కలవరపెట్టిన చమురు ధరలు ఇప్పుడు క్రమంగా దిగివస్తున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గడం, అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ప్రయత్నాలు ముందుకు సాగడం ఈ తగ్గుదలకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.ఫలితంగా సరఫరా అంతరాయం భయం తగ్గిపోవడంతో పెట్టుబడిదారుల ఆందోళన కూడా తగ్గి ంది.అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర సుమారు 76 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ ధర 72 డాలర్ల వద్ద కొన సాగుతోంది.ఒకే రోజులో ఈ రెండు సూచీలు ఒక శాతా నికి పైగా పడిపోవడం గమనార్హం.గత నెల రోజుల వ్యవధిలో బ్రెంట్,డబ్ల్యూటీఐ ధరలు 20 శాతానికి పైగా తగ్గాయి.ఇరాన్ సంక్షోభం ప్రారంభ సమయంలో హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణా ప్రభావితమవుతుందనే ఆందోళనలు మార్కెట్లను తీవ్రంగా ప్రభావితం చేశాయి. అయితే ప్రస్తుతం గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితులు క్రమంగా సాధారణ స్థితికి చేరుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

# ఖమేనీ అంత్యక్రియలకు మోడీకి పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

ఖోమ్ పట్టణాల్లో అంతిమ సంస్కారాలకు సంబంధించి కొన్ని కార్యక్రమాలు చేపట్టనున్నారు.అనంతరం 9వ తేదీన ఖమేనీ స్వస్థ లం మషాద్‌లో ఆయనను ఖననం చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ అంత్యక్రియల కార్యక్రమానికి హాజరుకావాలని భారత ప్రధాని నరేంద్ర మోడీని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఆహ్వానిం చినట్లు తెలుస్తోంది.ఈ మేరకు దౌత్య వర్గాలు బుధవారం వెల్లడించ గా దీనిపై కేంద్ర ప్రభుత్వం అధికారికంగా స్పందించాల్సి ఉంది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం మొదలు పెట్టిన మొదటి రోజే ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఖమేనీతో పాటు మరో 40 మంది అత్యున్నత స్థాయి అధికారులు మృతి చెందారు.ఈ దాడుల్లో ఖమేనీ కుమార్తె, అల్లుడు, కోడలు మనవరాలు సైతం మృతి చెందారు.

### మోడీ హాజరుపై సస్పెన్స్:

ఈ కార్యక్రమానికి మోడీ హాజరవుతారా లేదా అనేది సస్పెన్స్ గా మారింది. ఖమేనీ మరణించినప్పుడు తొలుత భారత ప్రభుత్వం ఎలాంటి అధికారిక సంతాపం ప్రకటించలేదు. ఆ తర్వాత రాయబార కార్యాలయానికి సంతాప సందేశం పంపించింది. ఇదిలా ఉంటే ప్రధాని మోడీ తన చివరి అధికారిక ద్వైపాక్షిక ఇరాన్ పర్యటనను మే 2016లో చేశారు. ఆ పర్యటనలో ఆయన చాబహార్ పోర్టును అభివృద్ధి చేసేందుకు త్రైపాక్షిక ఒప్పందంపై సంతకం చేయడానికి ఖమేనీ, అప్పటి అధ్యక్షుడు హసన్ రౌహానీని కలిశారు. రెండు సంవత్సరాల తర్వాత ఫిబ్రవరి 2018లో మోడీ ఆహ్వానం మేరకు అధ్యక్షుడు రౌహానీ భారతదేశ పర్యటనకు వచ్చి న్యూఢిల్లీ, హైదరాబాద్‌లలో పర్యటించారు. 2024 అక్టోబర్‌లో రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోడీ, పెజెష్కియన్‌లు చివరిసారిగా సమావేశమయ్యారు. ఆ సమావేశంలోనే ప్రధాని మోడీ, పెజెష్కియన్‌ను భారతదేశాన్ని సందర్శించాల్సిందిగా ఆహ్వానించారు. తాజాగా ఖమేనీ అంత్యక్రియలకు తమ ప్రతినిధిని ఎంపిక చేసే విషయంపై భారతదేశం ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని న్యూఢిల్లీ వర్గాలు తెలిపినట్లు జాతీయ మీడియా పేర్కొంది.

శ్వేత

# సంపాదకీయం

**గురువారం 25-6-2026**

# అయోధ్య రామయ్యా.. ఏమిటీ అపచారం!

అందరి బంధువయ్యా...అయోధ్య రామయ్యా అంటూ పాడుకునే హిందువులకు అయోధ్య అన్నా, రాముడన్నా విడదీయరాని బంధం ఉంది. ఎవరికి వారు అయోధ్య రాముడు తమవాడని భావిస్తారు. అందుకే అయోధ్య ఆలయ నిర్మాణం కోసం ఏళ్లుగా ఎదురు చూశారు. కోట్ల రూపాయలు ఆలయం కోసం విరాళంగా ఇచ్చారు. ఇంతటి పవిత్ర కార్యక్రమం జరిగి, ఆలయ నిర్మాణం పూర్తయిన తరవాత ఇప్పుడు నిధుల దారిమళ్లింపు గోల అందరినీ కలచి వేస్తోంది. నిజంగానే ఇది ఘోరమైన అపచారంగానే భావించాలి. రాముడిని నమ్మి భక్తులు భక్తితో సమర్పించిన కానుకులను కాజేస్తే ఎలా? రాముడి తిరిగొచ్చాడంటూ.. దేశవ్యాప్తంగా జరిగిన సంబరాలను అప్పుడే మరచిపోలేదు. అయోధ్య రామాలయానికి భక్తులు సమర్పించిన విరాళాలు, కానుకల నిర్వహణలో భారీ అక్రమాలు జరిగినట్లు వెల్లడయ్యింది. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం విరాళాల సొమ్ము చోరీకి గురైనట్లు బలమైన ఆధారాలను కనుగొంది. దీనికి సంబంధించిన ప్రాథమిక నివేదికను త్వరలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు సిట్ సమర్పించనుంది. కొన్ని రోజులుగా అయోధ్యలో సిట్ బృందం ముమ్మరంగా విచారణ జరిపింది. ఆలయ హుండీల నుంచి సేకరించిన నగదును లెక్కించే సమయంలో సీసీటీవీ ఫుటేజ్‌పై చేతివాటం ప్రదర్శించినట్లు దర్యాప్తులో తేలింది. కొన్ని కీలకమైన సీసీటీవీ దృశ్యాలను కావాలనే డిలీట్ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భక్తులు సమర్పించిన బంగారం, వెండి, వజ్రాభరణాల ను నకిలీ వాటితో మార్చేసారనే ఆరోపణలపై సిట్ లోతుగా విచారించింది. నిర్లక్ష్యంతో పాటు దీని వెనుక పెద్ద కుట్ర కోణం దాగి ఉందనే దిశగా అధికారులు దర్యాప్తు సాగిస్తున్నారు. అయోధ్య రామాలయానికి రోజూ పెరుగు తున్న భక్తుల తాకిడి చూసి.. పులకిస్తున్న మనసులు ఇంకా పూర్తిగా తేరుకోలేదు. ఇంతలోనే మహాపచారం జరిగిపోయిందన్న వార్త కలవరపెడుతోంది. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో సమర్పిస్తున్న విరాళాలు, కానుకలు మాయమయ్యా యన్న ఆరోపణలు అయోధ్యలో కలకలం రేపాయి.

మొదట్లో ఇవి ఉట్టి ఆరోపణలే అని భావించిన వారు కూడా..తర్వాత సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించడంతో అంతా దిగ్భ్రమకు గురయ్యారు. చివరకు సిట్ ప్రాథమిక విచారణలోఅడుగుడగునా నిర్లక్ష్యం నిజమేనని బయటపడటం.. సీసీ టీవీ ఫుటేజ్‌లో మార్పులు.. అన్నీ కలిసి రామభక్తుల మనోభావాల్ని తీవ్రంగా దెబ్బతీశాయినే చెప్పాలి. ఎంతో భక్తితో, నమ్మకంతో, విశ్వాసంతో రాముడి ఆలయానికి ఉపయోగపడతాయనే ఉద్దేశంతో ఇచ్చిన విరాళాలు కొందరు స్వార్థపరుల చేతిలోకి వెళ్లిపోయాయని, ఆలయ వ్యవహారాలు చూసే ట్రస్టే.. కంచే చేను మేసిన చందంగా వ్యవహరి స్తోందని తెలిసి.. భక్తులు నిర్ఘాంతపోతున్నారు. దీనిపై పెద్దగా ప్రచారం రాకుండా చూస్తున్న తీరు ఇంకా కలచివేస్తోంది. ఐదు వందల సంవత్సరాల తర్వాత రామాలయం కొలువుదీరిందని ఓవైపు భక్తులో సంతోషపడుతుంటే.. మరోవైపు ఆలయంలో జరిగిన నిధుల గోల్‌మాల్ వ్యవహారం హిందువుల మనోభావా లను దెబ్బతీసే వ్యవహారంగానే చూడాలి. మొదట్లో నిధులు దారిమళ్లాయనే ఆరోపణలు వచ్చినప్పుడు.. వాటిని రాజకీయ ప్రేరేపితంగా కొట్టిపారేసే ప్రయత్నం జరిగింది. కానీ భక్తుల నుంచి అభ్యంతరాలు రావడంతో.. యూపీ సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించింది. యోగి ఆదిత్యనాథ్ కూడా ఈ విషయంలో సీరియస్‌గానే ఉన్నట్లుగా కనిపిస్తోంది. సిట్ దర్యాప్తులో అన్నీ తెలుస్తాయని, కొంచెం ఓపిక పట్టాలని ఆయన చేసిన విజ్ఞప్తిని బట్టి తెలుసుకోవచ్చు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే..వచ్చేయేడు యూపి ఎన్నికలకు ముందు జరిగిన ఈ వ్యవహారం యోగా ప్రభుత్వానికి మచ్చలాంటిదే. మరోవైపు రాముడి పేరు చెప్పి.. పెద్ద మొత్తంలో సొమ్ము స్వాహా చేశారని ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయి. వచ్చే ఏడాది యూపీ ఎన్నికల తరుణంలో..రామాలయంలో నిధుల గోల్‌మాల్ వ్యవహారం..సంచలనం సృష్టిస్తోంది. ఈ భారీ అక్రమాలకు సంబంధించి సిట్ ఇప్పటివరకు ట్రస్ట్ అధికారులు, మేనేజ్‌మెంట్ సిబ్బంది, బ్యాంక్ ఉద్యోగులతో సహా దాదాపు 150 మందిని ప్రశ్నించింది. ట్రస్ట్ కార్యనిర్వాహకుడు అనిల్ మిశ్రా, కన్‌స్ట్రక్షన్ ఎయిడ్ గోపాల్ రావు పాత్రలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ కూడా ప్రస్తుతం నిఘా నీడలో ఉన్నారు. లెక్కింపు పక్రియలో పాల్గొన్న ఎస్‌బీఐ, టీసీఎస్‌లకు చెందిన ఆరుగురు ఉద్యోగుల ను కూడా ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో తిన్ను యాదవ్ అనే వ్యక్తితో పాటు కొందరు బ్యాంక్ సిబ్బందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యే అవకాశం ఉంది. భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో సమర్పించే నగదు, బంగారం, వెండి, ఇతర ఖరీదైన విరాళాలు అక్రమార్కుల భోజ్యం అయినట్టు దర్యాప్తు సంస్థ గుర్తించింది. ముఖ్యంగా ఇంత ప్రతిష్టాత్మకమైన పెద్ద ఆలయ నిర్వహణలో ముఖ్య విభాగాలు నిర్వహించే అధికారులు, ఉద్యోగులకు జవాబుదారీతనం లేకపోవడం, వారిపై పర్యవేక్షణ, నిఘా లోపించడం, సీసీటీవీ ఫుటేజీలు అదృశ్యం కావడం దర్యాప్తు సంస్థను ఆశ్చర్యపరిచింది. ట్రస్ట్‌కు చెందిన కీలక అధికారులు దర్యాప్తు పూర్తయ్యే వరకు అయోధ్య విడిచి వెళ్లకూడదని సిట్ ఆదేశించింది. ఆలయ నిర్వహణలో పారదర్శకత కోసం కాశీ విశ్వనాథ్ ఆలయం తరహాలోనే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నియమించాలని, ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణను పెంచాలని సిట్ సూచించనుంది. అలాగే విరాళాల లెక్కింపునకు బ్యాంకులు కేవలం రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే నియమించాలని, క్రమం తప్పకుండా ఆడిటింగ్ నిర్వహించాలని నివేదికలో సిఫార్సు చేయనున్నట్లు చెబుతున్నారు. అయోధ్య విరాళాలపై ఏర్పడిన వివాదంపై యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ స్పందించారు. ప్రజలు 15 రోజులు ఆగాలని కోరారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులు ఎవరైనా, ఎంతటివారైనా వదిలిపెట్టబోమంటూ హామీనిచ్చారు. మొత్తంగా రాముడి పేరు చెప్పి నిర్వాహకులే టోపీ పెట్టడం ఇప్పుడు తీవ్ర చర్చగా మారింది.

# ఖజానాకు గండి.. ఢిల్లీకి సంచులు

**తుమ్మల మట్టి దందా.. పొంగులేటి కాంట్రాక్టుల దోపిడీ**

**ముగ్గురు మంత్రులున్నా ఖమ్మం జిల్లాకు ఒరిగింది శూన్యం**

**కేసీఆర్ రాగానే యూరియా యాప్ బంగాళాఖాతానికే**

**మంత్రుల తీరుపై కేటీఆర్**

సత్తుపల్లి, జూన్ 24: రాష్ట్ర ఆదాయం పడిపోతుంటే, రెవెన్యూ మంత్రి పొంగులేటి సంపద మాత్రం కాంట్రాక్టుల ద్వారా వేల కోట్లకు పెరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సత్తుపల్లిలో జరిగిన పార్టీ కార్యకర్తలకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి తుమ్మల సీతారామ ప్రాజెక్టు నుంచి వంద కోట్ల మట్టిని దోచుకుంటున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 72 సార్లు ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి ఒక్క పైసా తీసుకురాలేదని, కానీ రాష్ట్రం నుంచి కాంగ్రెస్ అధిష్టానానికి రాహుల్ బంధు మాత్రం ఠంచన్‌గా వెళ్తోందని ఎద్దేవా చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం విద్యార్థుల తల్లిదండ్రులపై పది వేల కోట్ల భారం మోపుతోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టి అన్నదాతలను మోసం చేశారని కేటీఆర్ ధ్వజమెత్తారు. రుణమాఫీని కుదించడంతో పాటు బోనస్ విషయంలో దగా చేశారన్నారు. యూరియా యాప్ పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని, తాము అధికారంలోకి రాగానే ఆ యాప్‌ను బంగాళాఖాతంలో పడేస్తామన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.8 వేల కోట్లతో నిర్మించిన సీతారామ ప్రాజెక్టును కాంగ్రెస్ గాలికి వదిలేసిందని, కేసీఆర్ తిరిగి సీఎం కాగానే ఆ ప్రాజెక్టును పూర్తి చేసి సత్తుపల్లి రైతులకు నీళ్లందిస్తామని హామీ ఇచ్చారు.

# గ్రామాల సంక్షేమానికి శ్రీ సిమెంట్ 'కార్పొరేట్ సామాజిక బాధ్యత'

**సమాజ శ్రేయస్సే లక్ష్యంగా వైద్య శిబిరాలు, =ూ ప్లాంట్ల ఏర్పాటు**



పల్నాడు జిల్లా, జూన్ 24: గుంటూరు పరిసర ప్రాంతాల్లోని గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, సురక్షితమైన తాగునీటి సౌకర్యాలను కల్పించడంలో "శ్రీ సిమెంట్ లిమిటెడ్" సంస్థ ప్రశంసనీయమైన పాత్ర పోషిస్తోంది. తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (జూ=) కార్యక్రమాల్లో భాగంగా గుంటూరులోని తన కార్యకలాపాల పరిసర గ్రామాల్లో సమాజ సంక్షేమానికి సంస్థ నిరంతరం మద్దతునిస్తోంది. గత కొన్నేళ్లుగా పెద్దగార్లపాడు, ఇనుపరాజుపల్లి, కాచవరం, మరియు తుమ్మలచేరువు వంటి గ్రామాలలో అనేక ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తూ గ్రామీణ ప్రజలకు ఉచిత వైద్య సలహాలు, రోగ నిర్ధారణ పరీక్షలు మరియు మందులను అందజేస్తోంది. ఈ క్రమంలోనే 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 47 ఆరోగ్య శిబిరాలను నిర్వహించి 10,150 మందికి పైగా లబ్ధి చేకూర్చగా, గత కొన్ని సంవత్సరాలుగా 20,000 మందికి పైగా ప్రజలు ఈ సేవల వల్ల ప్రయోజనం పొందారు. ముఖ్యంగా 'మమత ప్రాజెక్ట్' కింద గర్భిణీ స్త్రీల కోసం త్రైమాసిక ప్రాతిపదికన ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ మాతృ ఆరోగ్య సంరక్షణకు సంస్థ ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోంది. ఆరోగ్యంతో పాటు ప్రజారోగ్యానికి మూలమైన స్వచ్ఛమైన తాగునీటి భద్రతను బలోపేతం చేయడానికి శ్రీ సిమెంట్ సంస్థ పలు మౌలిక సదుపాయాలను కల్పించింది. కేసనుపల్లి, దాచేపల్లి మున్సిపాలిటీలలో తాగునీటి సరఫరా వ్యవస్థకు మద్దతు ఇవ్వడం ద్వారా వరుసగా 1,000 మరియు 2,500 మంది నివాసితులకు తాగునీటి కష్టాలు తీర్చింది. అంతేకాకుండా, గత ఆర్థిక సంవత్సరంలో పెదగార్లపాడు, కాచవరం, ఇనుపరాజుపల్లి గ్రామాల్లో అత్యాధునిక ఆర్ఓ (=ూ) నీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయడంతో సుమారు 20,000 మంది నివాసితులకు శుద్ధి చేసిన తాగునీరు నమ్మదగిన రీతిలో అందుబాటులోకి వచ్చింది. ఈ సంస్థ చేపట్టిన ఆరోగ్య సంరక్షణ మరియు నీటి భద్రతా కార్యక్రమాలు గుంటూరు పరిసర పరిధిలోని దాదాపు 45,000 మంది ప్రజల జీవితాల్లో సానుకూల మార్పును తీసుకువచ్చాయి. స్థానిక సమాజాలపై దీర్ఘకాలిక సామాజిక ప్రభావాన్ని చూపిస్తూ, వారి జీవన ప్రమాణాలను మరియు నాణ్యతను మెరుగుపరచడానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని శ్రీ సిమెంట్ ప్రతినిధులు స్పష్టం చేశారు.

# నాగరాజును కాపాడటానికే 'సిట్'

**నిజాలు రావాలంటే సీబీఐ విచారణ జరగాల్సిందే**

**మాజీ మంత్రి అంబటి రాంబాబు డిమాండ్**



గుంటూరు, జూన్ 24: గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సస్పెండెడ్ సీఐ నాగరాజును కాపాడటమే లక్ష్యంగా సిట్ వ్యవహరిస్తోందని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సాయికృష్ణ కేసులో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సిట్ కాకుండా తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఐజీ రవికృష్ణ నేతృత్వంలో సిట్ ఏర్పడిన తర్వాతే కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లోని ఏడాది కాలపు సీసీటీవీ ఫుటేజ్ మాయం కావడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఫుటేజ్‌ను 18 నెలల పాటు భద్రపరచాల్సి ఉంచాల్సి ఉండగా, సాక్ష్యాలను రూపుమాపడానికే దాన్ని తొలగించారని విమర్శించారు. జూన్ 19న కేసు నమోదైనా, జూన్ 23 వరకు సీఐ నాగరాజును అరెస్ట్ చేయకుండా ఎవరి పేర్లు బయటపెట్టవద్దనే హామీతో బేరసారాలు సాగించారని దుయ్యబట్టారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా ఒక వ్యక్తిని కొట్టి చంపి, కనీసం బూడిద కూడా దొరకకుండా మృతదేహాన్ని దహనం చేసి సాక్ష్యాలు నాశనం చేశారని, ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర హోంమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేసుపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మౌనాన్ని అంబటి రాంబాబు తీవ్రంగా తప్పుపట్టారు. ఒకవైపు సాయికృష్ణ తల్లిని పరామర్శించేందుకు తమ పార్టీ నేతలను పంపి, మరోవైపు నిందితుడైన సీఐ నాగరాజుకు మద్దతుగా జనసేన కార్యకర్తలతో నినాదాలు చేయించడం సిగ్గుచేటన్నారు. ఈ ఘోరానికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులే అండగా నిలుస్తున్నారనే భావన ప్రజల్లో కలుగుతోందని, సీబీఐ విచారణ జరిగితేనే సీఐ నాగరాజుకు ఉన్న రూ.100 కోట్ల అక్రమాస్తుల గుట్టు కూడా రట్టవుతుందని పేర్కొన్నారు. ఇదే సందర్భంలో తనపై జరిగిన అక్రమ అరెస్టును ప్రస్తావిస్తూ.. టీడీపీ శ్రేణులు తన ఇంటిపై దాడి చేసి కారును ధ్వంసం చేసినా పోలీసులు పట్టించుకోలేదని, పైగా ఏడేళ్లలోపు శిక్ష పడే కేసుల్లో నోటీసులు ఇవ్వకుండా తనను 24 గంటలు లాకప్‌లో ఉంచి 18 రోజులు జైలుకు పంపారని మండిపడ్డారు. ఒత్తిళ్లకు లొంగి చట్టాన్ని ఉల్లంఘించిన పోలీసు అధికారులు వంశీధర్, మధు పవన్, గంగా వెంకటేశ్వర్లులకు కోర్టు నోటీసులు జారీ చేసిందని వెల్లడించారు. పోలీసుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా జూలై 29న తన నివాసం నుండి డీజీపీ కార్యాలయం వరకు 29 కిలోమీటర్ల మేర రెండు రోజుల పాటు వినతి పాదయాత్ర చేపట్టనున్నట్లు అంబటి రాంబాబు ప్రకటించారు.


# కెనడా, ఆస్ట్రేలియా లేదా జర్మనీలో స్థిరపడాలనుకుంటున్నారా?

**మీ విదేశీ భవిష్యత్తుకు ఇదే సరైన సమయం!**

కెనడా, ఆస్ట్రేలియా లేదా జర్మనీలో స్థిరపడాలనుకుంటున్నారా? మీ అంతర్జాతీయ కెరీర్ మరియు మెరుగైన జీవన ప్రమాణాల కలలను నిజం చేసుకునే సరైన సమయం ఇదే. Exxeella Immigration Services ద్వారా Canada PR, Australia PR మరియు Germany Opportunity Card / Job Seeker Visa అవకాశాలను సులభంగా పొందండి. అనుభవజ్ఞులైన ఇమ్మిగ్రేషన్ నిపుణుల మార్గదర్శకత్వం, పూర్తి డాక్యుమెంటేషన్ సహాయం, పారదర్శకమైన ప్రాసెస్ మరియు వ్యక్తిగత ప్రొఫైల్ ఆధారిత సలహాలతో మీ విదేశీ ప్రయాణాన్ని విజయవంతం చేయండి.

కెనడా మరియు ఆస్ట్రేలియా వంటి దేశాల్లో శాశ్వత నివాస హక్కు (PR), ప్రపంచ స్థాయి ఆరోగ్య సేవలు, పిల్లలకు నాణ్యమైన విద్య, కుటుంబ భద్రత మరియు మెరుగైన ఉద్యోగ అవకాశాలను పొందే అవకాశం ఉంది. జర్మనీ రాజూజూశీతీబఅఱ్‌ఎ ఝుతీస ద్వారా యూరప్‌లో ఉద్యోగ అన్వేషణకు మరియు అంతర్జాతీయ కెరీర్ నిర్మాణానికి మార్గం సుగమమవుతుంది.

మీ విద్య, వయస్సు, పని అనుభవం మరియు భాషా నైపుణ్యాల ఆధారంగా మీ అర్హతను అంచనా వేసి, మీకు సరిపోయే ఇమ్మిగ్రేషన్ మార్గాన్ని సూచిస్తాము. ప్రతి దశలో నిపుణుల సహాయం అందిస్తూ, మీ విదేశీ ప్రయాణాన్ని సులభతరం చేయడం మా లక్ష్యం. ప్రపంచ స్థాయి అవకాశాలు, మెరుగైన ఆదాయం మరియు భవిష్యత్తు కోసం ఈరోజే మొదటి అడుగు వేయండి.



MD. Jahangir
Immigration Adviser
Exxeella Immigration Services
89779 44266
jahangirmd@exxeella.com



## ఓటరు జాబితా సమగ్ర సవరణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 24**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమం జిల్లాలో జూన్ 25 నుంచి ప్రారంభం కానుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ తెలిపారు. ఓటరు జాబితాను మరింత ఖచ్చితత్వంతో, పారదర్శకంగా రూపొందించేందుకు ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావడం, ఓటరు జాబితాలోని లోపాలను సరిదిద్దడం, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులను పారదర్శకంగా నిర్వహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా పునాది వంటిదని, దాని ఖచ్చితత్వం కోసం ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు జిల్లాలో ఇంటింటి సర్వే (ఎన్యూమరేషన్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తారని, ప్రజలు అవసరమైన సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఎస్ఐఆర్-2026 కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనుండగా, అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ చేపడతారు. అనంతరం సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కార ప్రక్రియ కొనసాగి, అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు చురుకుగా సహకరించాలని కలెక్టర్ కోరారు. ముఖ్యంగా కొత్తగా ఓటు హక్కు పొందిన యువత తమ పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఒలింపిక్ డే రన్ దోహదం చేస్తుంది: ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 24**

ఒలింపిక్ డే రన్ అనేది కేవలం క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడమే కాకుండా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదం చేస్తుందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మైదానంలో నిర్వహించిన 40వ అంతర్జాతీయ ఒలింపిక్ డే రన్ కార్యక్రమాన్ని ఉమ్మడి మెదక్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఒలింపిక్ టార్చ్ వెలిగించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత క్రీడలను జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఒలింపిక్ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని, క్రీడా రంగంలో మరింత మంది యువత రాణించాలని ఆకాంక్షించారు. అంబేద్కర్ మైదానం నుంచి ఐబీ వరకు నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు, క్రీడాకారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు హరికిషన్, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ జగన్, సంయుక్త కార్యదర్శులు వెంకటేశం, జేశ్వంత్ గౌడ్, పీఈటీ సంఘం బాధ్యులు షర్ఫుద్దీన్, సుభాష్ గౌడ్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలి

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 24 :**



వానాకాలం సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని రైతు సంగం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ఉన్న ఆగ్రోస్ కేంద్రాన్ని ఆయన సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వానాకాలం పంటల సాగు ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు అవసరమైన కందులు, పెసలు, మినుములు, సోయాబీన్, జీలుగు తదితర పంటల విత్తనాలు తగినంతగా అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందు లు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆగ్రోస్ కేంద్రాలకు అన్ని రకాల విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని కోరారు. ప్రస్తుతం యూరియా, డీఏపీ వంటి ప్రధాన ఎరువులు రైతులకు సకాలంలో అందడం లేదని, దీంతో రైతులు ప్రైవేట్ మార్కెట్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడు తోందని పేర్కొన్నారు. యూరియా సరఫరా పై అమలులో ఉన్న యాప్ విధానా న్ని రద్దు చేసి రైతులకు సులభంగా ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే యూరియా, డీఏపీ ఎరువుల సరఫరాను పెంచి ధరలను నియం త్రించాలని ప్రభుత్వాన్ని కోరారు. కొంతమంది వ్యాపారులు యూరియా, డీఏపీ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించిన ఆయన, అలాంటి వ్యాపారులపై వ్యవసాయ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎరువులు, విత్తనాల కొరత లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంగం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్‌తో పాటు నాయకులు యాదయ్య, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# క్రాంతి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 24**



కొండాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగయ్య పెద్ద కుమారుడు క్రాంతి అకాల మరణం చెందడంతో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ బుధవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. క్రాంతి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే, తీవ్ర విషాదంలో ఉన్న నాగయ్యతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్రాంతి మృతి వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని పేర్కొన్నారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్రాంతి అంత్యక్రియల్లో పాల్గొని చివరి నివాళులు అర్పించారు. అదే విధంగా నందికంది గ్రామంలో తన గురువుగా ఉన్న విశ్రాంత ఉపాధ్యాయుడు రామచంద్రయ్య పరమపదించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్, వారి అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు. రామచంద్రయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి తన సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో కొండాపూర్ సర్పంచ్ అమరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రుక్మొద్దీన్, మండల పార్టీ అధ్యక్షుడు విట్టల్, గోవర్ధన్ రెడ్డి, పరమానందం, శ్యామ్‌రావు, సర్పంచ్ సతీష్, సత్యానందం, మహేష్, సర్పంచ్ మోహన్ గౌడ్, జగదీశ్వర్, శేఖర్, ఆంజనేయులు తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలి

## ఎంపీ సురేష్ షెట్కర్

## జిల్లాలోని అన్ని అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి: ఎంపీ రఘునందన్ రావు







**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 24**

ప్రజలకు ప్రయోజనం చేకూర్చే అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ సురేష్ షెట్కర్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం నిర్వహించారు.




**మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావుతో కలిసి కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల పనుల పురోగతిని సమీక్షించారు. సమావేశంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ షెట్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపడుతున్న పనుల్లో జాప్యాన్ని నివారించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అమృత్ పథకం కింద కొనసాగుతున్న పనులను వేగవంతం చేయడంతో పాటు కొత్తగా ఏర్పడిన కోహిర్ మున్సిపాలిటీకి అవసరమైన తాగునీటి కనెక్షన్ల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.**

రోడ్లు, భవనాల శాఖ, జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనుల్లో ఆలస్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. పీఎం స్వనిధి పథకం కింద అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేసి, డ్రోన్ సాంకేతికత వినియోగంపై అవగాహన కల్పించాలని, ప్రతి గ్రామంలో మహిళా సంఘాలకు డ్రోన్లు అందించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద చెరువుల సుందరీకరణ పనులను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు నారింజవాగు సుందరీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులను పారదర్శకంగా, సమర్థవంతంగా వినియోగిస్తూ అర్హులైన లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని అధికారులను కోరారు. జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. ముత్తంగి నుంచి సంగారెడ్డి చౌరస్తా వరకు జాతీయ రహదారి పనులు ఆలస్యం కావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని జాతీయ రహదారుల సంస్థ అధికారులను ఆదేశించారు. పెద్దాపూర్ రోడ్డు పనులు పెండింగ్‌లో ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి--పటాన్‌చెరు మార్గంలో అవసరమైన రహదారి అభివృద్ధి పనులకు సీఆర్ఎఫ్ కింద ప్రతిపాదనలు పంపాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు.

**పీఎం కుసుం, పీఎం సూర్యఘర్ యోజన పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించి రైతులు, ప్రజలు సౌర విద్యుత్ వినియోగం వైపు ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కలెక్టరేట్ భవనంలో కూడా సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని కలెక్టర్‌కు సూచించారు. జిల్లాకు మంజూరైన 12 ఆహార ధాన్య నిల్వ గోదాముల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి వెంటనే పనులు ప్రారంభించాలని అన్నారు. సంగారెడ్డి-పటాన్చెరు రింగ్ రోడ్డు పరిసర ప్రాంతంలో ఆధునిక చేపల మార్కెట్ ఏర్పాటు కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.**

మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సమస్యలు తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించి జిల్లా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ టీబీ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా తండాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ సమావేశంలో చర్చించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, కార్యాలయాలు, నివాస మరియు వాణిజ్య భవనాలలో పీఎం సూర్యఘర్ యోజన కింద సోలార్ వ్యవస్థల ఏర్పాటుపై విస్తృత అవగాహన కల్పించి ప్రోత్సహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ జ్యోతి, జిల్లా స్థాయి అధికారులు, జాతీయ రహదారుల సంస్థ ప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు, దిశా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలి

## ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 24 :**

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జవహర్ నవోదయ విద్యాలయాన్ని తక్షణమే ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు లేఖ రాశారు. లేఖను ఈరోజు జరిగిన దిశ మిటింగ్ లో అందజేశారు.. కేంద్ర ప్రభుత్వం 2024లో తెలంగాణ రాష్ట్రానికి మంజూరు చేసిన ఏడు కొత్త జవహర్ నవోదయ విద్యాలయాలలో ఒకటి సంగారెడ్డి జిల్లాకు కేటాయించబడిందని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు విద్యాలయం ప్రారంభం కాలేదని, దీంతో విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సంగారెడ్డి మండలం , కంది మండలం, కొండాపూర్ మండలాల పరిధిలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, 2026-27 విద్యా సంవత్సరంలోనే విద్యాలయం ప్రారంభించేందుకు అవసరమైన భూ కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లా విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం జవహర్ నవోదయ విద్యాలయం ఎంతో ఉపయోగకరమని, ఈ విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.



# మోడల్ యునైటెడ్ నేషన్‌లో సంగారెడ్డి విద్యార్థులకు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 24

రాష్ట్రస్థాయిలో నిర్వహించిన తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషన్ (టి-మన్) కార్యక్రమంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన సంగారెడ్డి జిల్లా విద్యార్థులు ప్రతిష్ఠాత్మక అవార్డులను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ మరియు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలాస్ విజేతలకు బహుమ తులు, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందిం చారు. తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషన్‌లో భాగంగా నిర్వహించిన యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (యూఎన్‌డీపీ) కమిటీ విభాగంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి హై కమాండేషన్ అవార్డు అందుకున్నారు. దౌలతాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అనమికరాయ్, నందికండి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కార్తికేయ చారి ఈ గౌరవాన్ని దక్కించు కుని జిల్లాకు కీర్తి తీసుకువ చ్చారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా సాంఘిక శాస్త్ర ఫోరం అధ్యక్షులు రామ్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్లు మంజులత, శశికళ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. రాష్ట్ర స్థాయిలో అవా ర్డులు సాధిం చిన విద్యార్థులతో పాటు వారికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులను కూడా వారు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా విద్యాధికారి ఆర్. రోహిణి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి పోటీలలో పాల్గొని మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.




# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం

### -29వ వార్డులో గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 24




రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం చిరకాలంగా ఎదురుచూస్తున్న సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సాకారం చేస్తోందని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డులో నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందం తనకు ఎంతో సంతృప్తిని కలిగిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా లక్షలాది మంది పేద కుటుంబాలు సొంతింటి కలను నెరవేర్చుకున్నాయని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు భద్రమైన నివాసాన్ని కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులై ఇంకా దరఖాస్తు చేసుకోని వారు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయో జనాలను పొందాలని ఆమె సూచించారు. పేదల సంక్షేమం, గృహ భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనితా సంతోష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, నాయకులు కూన సంతోష్, కౌన్సిలర్ సంగీతా మహేష్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ అత్యవసర సమావేశం

### ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలని జగ్గారెడ్డి పిలుపు

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 24





సంగారెడ్డి నియోజకవర్గంలో నిర్వహించనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెం ట్ జగ్గారెడ్డి అధ్యక్షత వహించగా, నియోజకవర్గానికి చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), ఇంచార్జ్‌లు, పార్టీ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎన్నికల వ్యవస్థ పారదర్శకతపై కాంగ్రెస్ పార్టీ అప్రమత్తంగా ఉందన్నారు. కొన్ని రాష్ట్రాల్లో ప్రతిపక్షాలకు అనుకూలంగా ఉన్న ఓట్ల తొలగింపు కారణంగా అధికార పార్టీకి లాభం చేకూరిందనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సూచనల మేరకు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. జూన్ 25 నుంచి ప్రారంభమయ్యే ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో పార్టీ నాయకులు, బీఎల్ఏలు పూర్తి సమయాన్ని కేటాయించి పనిచేయాలని సూచించారు. ఓటర్ల హక్కులను కాపాడటం, వారి పేర్లు జాబితాలో సక్రమంగా ఉండేలా చూడటం ప్రతి కార్యకర్త బాధ్యత అని స్పష్టం చేశారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని 282 మంది బీఎల్ఏలు, ఇంచార్జ్‌లు, ముఖ్య నాయకులకు ఈ సందర్భంగా ప్రత్యేక దిశానిర్దేశం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నాలుగు విడతలుగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. జూలై 6న మరోసారి సమావేశమై ప్రస్తుత పరిస్థితులను లోతుగా సమీక్షిస్తామని చెప్పారు. ప్రతి సమావేశానికి బీఎల్ఏలు, ఇంచార్జ్‌లు, గెలుపొందిన, ఓడిన సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ఇతర ముఖ్య నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. పార్టీ తరఫున అందజేసిన గుర్తింపు కార్డులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని, కార్యకర్తల పనితీరు ఆధారంగానే వారి గుర్తింపు కొనసాగుతుందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, పార్లమెంట్ ఇంచార్జ్ ప్రీతం, కాంగ్రెస్ నాయకుడు దయాకర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అవకాశాలు కల్పిస్తే మహిళలు అద్భుతాలు సృష్టిస్తారు

హైదరాబాద్, జూన్ 24 :



మహిళలకు అవకాశాలు, ప్రోత్సాహం కల్పిస్తే ఏ రంగంలోనైనా అద్భుత విజయాలు సాధించగలరని కార్మిక, ఉపాధి, శిక్షణ, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో వీటా (విమెన్ ఎంపవర్‌మెంట్ తెలుగు అసోసియేషన్) ఇండియా విభాగం ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన మహిళా సాధికారత సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళల సాధికారత, ఉపాధి అవకాశాలు, గ్రామీణ మహిళల ప్రపంచ స్థాయి ప్రభావం వంటి అంశాలపై నిర్వహించిన ఈ సదస్సులో పెద్ద సంఖ్యలో మహిళలు, యువతులు, విద్యార్థినులు పాల్గొన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ పురోగతికి కృషి చేస్తున్న సంస్థల సేవలను మంత్రి అభినందించారు. వీటా వ్యవస్థాపకురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకమని మంత్రి పేర్కొన్నారు. గృహిణిగా జీవితాన్ని ప్రారంభించి విజ యవంతమైన పారిశ్రామికవేత్తగా ఎదగడ మే కాకుండా అమెరికాలో వీటా సంస్థను స్థాపించి, ఇప్పుడు భారతదేశంలో కూడా కార్యకలాపాలను విస్తరించడం మహిళల సామర్థ్యానికి నిదర్శనమని అన్నారు. మహిళలు విద్య, ఉద్యోగాలు, వ్యాపారం, పరిపాలన, రాజకీయాలు తదితర అన్ని రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్నారని మంత్రి తెలిపారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, వారి భాగస్వామ్యం లేకుండా సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేశారు. రాజకీయాలు, నిర్ణయాత్మక పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

# విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి చర్యలు

మంచిర్యాల, జూన్ 24 :



వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. బుధవారం మంచిర్యాల జిల్లా చెన్నూరులో పర్యటించిన ఆయన కొత్తగా ఏర్పాటు చేసిన 33 కేవీ దేవులవాడ ఫీడర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా 132/33 కేవీ చెన్నూర్ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన సీఎండీ విద్యుత్ సరఫరా వ్యవస్థ, లోడ్ పరిస్థితులు, పరికరాల పనితీరు, భవిష్యత్ అవసరాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. కొత్తగా ప్రారంభించిన 33 కేవీ దేవులవాడ ఫీడర్ ద్వారా సంబంధిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడటంతో పాటు లోడ్ పంపిణీ సమర్థవంతంగా జరుగుతుందని తెలిపారు. దీంతో వినియోగదారులకు మెరుగైన సేవలు అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వేమనపల్లి--కోటపల్లి ప్రాంతాల మధ్య ఇంటర్ లింకింగ్ లైన్ల ఏర్పాటుపై కూడా అధికారులతో చర్చించారు. ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా మార్గా లు అందుబాటులోకి వస్తే అత్యవసర పరిస్థితుల్లో కూడా విద్యుత్ అంతరాయాలు తగ్గుతాయని అన్నారు. ఈ అంశంపై సాంకేతిక, ఆర్థిక సాధ్యా సాధ్యాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చెన్నూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను సందర్శించి ఫీడర్‌వారీ లోడ్లు, నిర్వహణ ప్రమాణాలు, వినియోగదారుల అవసరాలపై సమీక్ష నిర్వహించారు. విద్యుత్ అంతరాయాలను తగ్గిస్తూ నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సబ్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. కొత్తగా నిర్మిస్తున్న ఎస్‌పీఎం షెడ్, విద్యుత్ రెవెన్యూ కార్యాలయ భవన నిర్మాణ పనులను కూడా పరిశీలించిన సీఎండీ, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



## విధి నిర్వహణలో నిబద్ధతతో పాటు ఆధునిక సాంకేతికతను వినియోగించాలి

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 24

విధి నిర్వహణలో నిబద్ధత, పనిపట్ల అంకితభావం కలిగి ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించినప్పుడే పోలీసు శాఖకు మంచి పేరు వస్తుందని జోన్--7 జోగులాంబ డీఐజీ, ఇన్‌చార్జ్ జోన్--6 చార్మినార్ డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్, ఐపీఎస్. పేర్కొన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం జహీరాబాద్ డీఎస్పీ కార్యాలయం, జోగిపేట సర్కిల్ కార్యాలయం, పుల్కల్ పోలీస్ స్టేషన్‌లను ఆయన సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డితో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటిన డీఐజీ, అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్స్, రికార్డుల నిర్వహణ, కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించారు. కార్యాలయాల్లో నిర్వహిస్తున్న పరిపాలనా విధానాలను సమీక్షించి పలు సూచనలు చేశారు.

### నాణ్యమైన దర్యాప్తుపై దృష్టి పెట్టాలి

డీఎస్పీ కార్యాలయ రికార్డులను పరిశీలించిన డీఐజీ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో, అత్యాచారాలు, డౌరీ డెత్ వంటి సున్నితమైన కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. సబ్‌డివిజన్ పరిధిలో జరుగుతున్న నేరాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ పోలీసు అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు అందించాలని డీఎస్పీకి సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మిస్సింగ్ కేసులు, నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల్లో పోలీసులపై విశ్వాసం పెంచేలా పని చేయాలని సూచించారు.

### నిమ్జ్ నేపథ్యంలో ఆర్థిక నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జహీరాబాద్ పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ (నిమ్జ్) ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెరగనున్నాయని డీఐజీ పేర్కొన్నారు. అదే సమయంలో ఆర్థిక నేరాలు, మోసాల అవకాశాలు కూడా పెరిగే అవకాశం ఉన్నందున పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానిత ప్రాంతాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహించి, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా పెంచాలని చెప్పారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతంగా ఉన్న జహీరాబాద్‌లో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ రవాణా జరిగే అవకాశాలు ఉన్నందున చెక్‌పోస్టులను మరింత పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.

### సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించాలి

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదిదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని తగిన పరిష్కారం చూపాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు, కేసు వివరాలను నిర్ణీత గడువులోగా సీసీటీఎన్ఎస్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని, పగలు--రాత్రి బీట్ విధుల్లో అనుమానిత వ్యక్తుల వేలిముద్రలను పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ పరికరాల ద్వారా తనిఖీ చేసి పాత నేరస్తులను గుర్తించాలని సూచించారు. సీసీటీఎన్ఎస్--2.0, టీఎస్‌కాప్, హెచ్‌ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, సీడీఆర్, పాపిలాన్ డివైస్ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలపై పూర్తి అవగాహన పెంపొందించుకొని నేరాల నియంత్రణలో సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.

### కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం

సమాజంలో నేరాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల నివారణకు కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని డీఐజీ సూచించారు. నేరాల నివారణలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి గ్రామాలు, పట్టణాల్లో మరిన్ని కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

### అధికారులు, సిబ్బందికి ప్రశంసలు

తనిఖీల అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడిన డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. డీఎస్పీ కార్యాలయం, పోలీస్ స్టేషన్ల నిర్వహణ, రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.





# వాగు దాటించేందుకు తెప్పే దిక్కు

**ములుగు, జూన్ 24 :**

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లిలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. భారీ వర్షాల కారణంగా జంపన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో తీవ్ర అనారోగ్యానికి గురైన ఓ వ్యక్తిని ఆస్పత్రికి తరలించేందుకు గ్రామస్థులు తెప్పను ఆశ్రయించాల్సి వచ్చింది. గ్రామానికి చెందిన రాకేష్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు అతడిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని ప్రయత్నించారు. అయితే గ్రామానికి వెలుపలికి వెళ్లే మార్గంగా ఉన్న జంపన్న వాగు పొంగిపొర్లుతుండటంతో ఎలాంటి వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోయింది. దీంతో గ్రామస్థులు కలిసి తెప్పను ఏర్పాటు చేసి రాకేష్‌ను వాగు దాటించారు. తెప్పపై రోగిని తరలిస్తున్న దృశ్యాలు స్థానికులను కలచివేశాయి. అత్యవసర పరిస్థితుల్లో కూడా వైద్య సేవలు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం వచ్చినప్పుడల్లా ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని తెలిపారు.



# భూమయ్యగారిపల్లెలో ఆలయ ప్రారంభోత్సవంలో జగన్

**పులివెందుల, జూన్ 24 :**

పులివెందుల పర్యటనలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వేముల మండలంలోని భూమయ్యగారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గట్టు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామానికి చేరుకున్న ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు.ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించగా, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించగా, ఆయన భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధి కోసం ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి సహకరించిన గ్రామ పెద్దలు, దాతలను స్థానికులు అభినందించారు. గ్రామంలో నూతన ఆలయం అందుబాటులోకి రావడంతో భక్తులకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు మరింత అనుకూల వాతావరణం ఏర్పడిందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఆలయం గ్రామానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.జగన్ మోహన్ రెడ్డి ఆలయ ప్రాంగణంలో కొద్దిసేపు గడిపి గ్రామస్తులతో మాట్లాడారు.

# సీఐ నాగరాజుకు రిమాండ్

**విజయవాడ, జూన్ 24 :**

విజయవాడలో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ అదృశ్యం, మృతి కేసులో కీలక నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కృష్ణలంక సీఐ నాగరాజుకు కోర్టు రిమాండ్ విధించింది. దీంతో ఆయనను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్న నాగరాజును విచారణ అనంతరం విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. కేసుకు సంబంధించిన వాదనలు, దర్యాప్తు వివరాలను పరిశీలించిన న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించినట్లు సమాచారం. కోర్టు ఆదేశాల మేరకు సీఐ నాగరాజును కట్టుదిట్టమైన భద్రత మధ్య రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. విజయవాడ నుంచి మూడు ఎస్కార్ట్ వాహనాల సహాయంతో ప్రత్యేక భద్రతా ఏర్పాట్ల మధ్య జైలుకు తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

# భద్రతతోనే బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి

**పెద్దపల్లి, జూన్ 24 :**



రామగుండం ఏరియా--2లో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఆధ్వర్యంలో 21వ త్రైపాక్షిక భద్రతా సమీక్ష సమావేశం నిర్వహించారు. గనుల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో పాల్గొన్న అధికారులు సూచించారు. సమావేశంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ మాట్లాడుతూ భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ఉత్పత్తి పెంపుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. యంత్రాల పని గంటలను సమర్థవంతంగా పెంచి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని సూచించారు. ప్రతి గనిలో శాస్త్రీయ భద్రతా అధ్యయనాలు నిర్వహించి ఉద్యోగుల్లో భద్రతా అవగాహన పెంపొందించాలని అన్నారు. 2026--27 సంవత్సరానికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను 'జీరో హార్మ్' లక్ష్యంతో సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా ఉత్పత్తి, భద్రత రెండింటినీ సమన్వయం చేయాలని సూచించారు. డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (మైనింగ్) సాగేష్ కుమార్ ఎం.ఆర్. నేతృత్వంలోని డీజీఎంఎస్ బృందం గత సమావేశంలో చేసిన సూచనల అమలు తీరును సమీక్షించింది. ప్రమాదాల నివారణ చర్యలు, యంత్రాల భద్రత, విద్యుత్ భద్రత, కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమం వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. రామగుండం--2 జనరల్ మేనేజర్ బి. వెంకటయ్య మాట్లాడుతూ ప్రమాద రహిత ఉత్పత్తి కోసం నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉద్యోగులు, కార్మికుల్లో భద్రతా సంస్కృతి పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

**నాగర్‌కర్నూలు, జూన్ 24 :**



నాగర్‌కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి, చెన్నపురావుపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల గృహ కలను సాకారం చేసేందుకు తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం రూ.22,500 కోట్ల వ్యయంతో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయించిన ప్రభుత్వం ఇప్పుడు రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 2 వేల ఇళ్ల చొప్పున మంజూరు చేసి పేద కుటుంబాలకు గృహ భద్రత కల్పిస్తున్నట్లు వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. గృహ నిర్మాణంలో ఉన్న లబ్ధిదారులకు దశలవారీగా ప్రతి సోమవారం బిల్లులు చెల్లిస్తూ పనులను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు.ం





# బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి

**హైదరాబాద్, జూన్ 24 :**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను ఈ ఏడాది అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నిర్వహించిన బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశంలో లండన్ నుంచి జూమ్ ద్వారా పాల్గొని ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ఒకే కార్పొరేషన్ పరిధిలో నిర్వహించిన బోనాలను ఈసారి మూడు కార్పొరేషన్ల పరిధిలో మరింత ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే ఈ మహోత్సవం విజయవంతం కావాలంటే అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని ఆలయాల్లో బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి ఆలయంలో ప్రారంభమయ్యే ఉత్సవాలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందన్నారు. బోనాల సమర్పణ, ఘటోత్సవాలు, తొట్టెల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, రంగం కార్యక్రమాలు, గావుపట్టడం, సాగనంపు వంటి సంప్రదాయ కార్యక్రమాలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు.

# ఇల్లందు సమస్యలపై మంత్రి దృష్టి

**హైదరాబాద్, జూన్ 24 :**


ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇల్లందు ప్రాంతానికి సంబంధించిన పలు ప్రజా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల సమస్యలు, అభివృద్ధి పనులు, ప్రజా అవసరాలకు సంబంధించిన అంశాలను గుమ్మడి నర్సయ్య వివరించారు. స్థానికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమస్యలను ఓపికగా విన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వాటిపై సానుకూలంగా స్పందించారు. ప్రజలకు ఉపయోగపడే అంశాల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అత్యవసరంగా పరిష్కరించాల్సిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి కార్యాచరణ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు సూచించే సమస్యలను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు ప్రతి ప్రాంతానికి చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.



# ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.1.22 కోట్ల మోసం

**, జూన్ 24 :**

ఆన్‌లైన్ ట్రేడింగ్, పెట్టుబడుల పేరుతో భారీ సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఆరుగురు సభ్యు ల ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా వలలో చిక్కుకున్న ఓ వ్యక్తి రూ.1.22 కోట్లు కోల్పోయినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల్లో ఐదుగురు మహారాష్ట్రకు చెందిన వారు కాగా, ఒకరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ఉన్నారు. పోలీసుల వివరాల ప్రకారం, హైదరాబాద్‌కు చెందిన బాధితుడిని ఈ ఏడాది జనవరిలో "282 బార్‌క్లేస్ ఇండియా హై క్వాలిటీ స్టాక్ ట్రేడింగ్ రీసెర్చ్ గ్రూప్" పేరుతో నిర్వహిస్తున్న వాట్సాప్ గ్రూప్‌లో చేర్చారు. అధిక లాభాలు, ప్రత్యేక ఐపీఓ కేటాయింపులు వస్తాయని నమ్మించి నకిలీ పెట్టుబడి వేదికల ద్వారా డబ్బులు పెట్టుబడి పెట్టేలా ప్రలోభపెట్టారు. మొదట బాధితుడి విశ్వాసం పొందేందుకు రూ.1.05 లక్షలను విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. దీంతో నమ్మకం పెం చుకున్న బాధితుడు 19 విడ తల్లో మొత్తం రూ.1,22, 18, 029 పెట్టుబడి పెట్టాడు. అనంత రం అతని ఖాతాలో రూ. 15.69 కోట్ల లాభం వచ్చినట్లు నకిలీ వివరాలు చూపించి మరింత డబ్బు



చెల్లించాలని ఒత్తిడి తెచ్చారు. ఐపీఓ షేర్ల కేటాయింపు పేరు తో మరో రూ.35 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేయడంతో బాధితుడికి అనుమానం వచ్చి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు మోసం వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో నిందితులు మ్యూల్ బ్యాంక్ ఖాతాలను ఉపయోగించి నిధుల బదిలీలు జరిపినట్లు తేలింది.



# గోదావరి తాగునీటి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి

**హైదరాబాద్, జూన్ 24 :**

హైదరాబాద్ నగర భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న గోదావరి తాగునీటి సరఫరా ప్రాజెక్టు ఫేజ్-2, ఫేజ్-3 పనులను జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షిస్తూ నిర్మాణ సంస్థలు నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. మల్లన్నసాగర్ వద్ద నిర్మాణంలో ఉన్న పంప్ హౌస్‌తో పాటు 3000 మిల్లీమీటర్ల వ్యాసం గల ప్రధాన పైప్‌లైన్ నిర్మాణ పనులను అశోక్ రెడ్డి పరిశీలించారు. ప్రాజెక్టు అమలులో కొనసాగుతున్న వివిధ నిర్మాణ కార్యకలాపాలపై అధికారులను అడిగి తెలుసుకొని పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. హైదరాబాద్ నగరానికి దీర్ఘకాలిక తాగునీటి భద్రత కల్పించడంలో ఈ ప్రాజెక్టు కీలకమని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న ఈ పనులు సమయానికి పూర్తవ్వడం అత్యంత ముఖ్యమని తెలిపారు. ప్రాజెక్టు అమలులో ఎలాంటి జాప్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అదనపు సిబ్బంది, యంత్రాలను సమకూర్చుకోవాలని నిర్మాణ సంస్థల ప్రతినిధులకు సూచించారు. నిర్మాణ దశలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి పనుల పురోగతిని మరింత మెరుగుపరచాలని అధికారులకు ఆదేశించారు. ప్రాజెక్టును సెప్టెంబర్-2027 నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జలమండలి ఎండీ స్పష్టం చేశారు.



# దేశానికే ఆదర్శంగా ఏపీ విద్యా నమూనా: నారా లోకేశ్

**అవనిగడ్డ, జూన్ 24 :**

కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని మోపిదేవి మండలం కొక్కిలిగడ్డలో నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులతో మమేకమయ్యారు. అనంతరం పాఠశాల భవనాలను పరిశీలించి విద్యా సదుపాయాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకురావాలంటే విద్యారంగాన్ని బలోపేతం చేయడం అత్యంత అవసరమని అన్నారు. విద్య అనేది వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజ పురోగతికి కూడా ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వంలో అత్యంత సవాళ్లతో కూడిన విద్యాశాఖ బాధ్యతలను స్వీకరించినట్లు తెలిపారు. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావడం ఒక్క ప్రభుత్వంతో సాధ్యం కాదని, ఉపాధ్యాయుల సహకారం లేకుండా ఎలాంటి సంస్కరణలు విజయవంతం కావని నారా లోకేశ్ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని, వారి అంకిత భావమే రాష్ట్ర విద్యారంగ పురోగతికి బలమని అన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో అమలు చేసే శక్తి ఉపాధ్యాయులకే ఉందని పేర్కొన్నారు.

# ఫిఫా వరల్డ్ కప్‌లో కొలంబియా సత్తా.. నాకౌట్‌కు అర్హత

**న్యూఢిల్లీ, జూన్ 24, 2026 :**



అంతర్జాతీయ ఫుట్‌బాల్ వేదికపై కొలంబియా జట్టు అద్భుత ప్రదర్శనతో సరికొత్త రికార్డు నమోదు చేసింది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఫిఫా వరల్డ్ కప్‌లో గ్రూప్ దశను విజయవంతంగా పూర్తి చేసి నాకౌట్ దశకు అధికారికంగా అర్హత సాధించింది. బుధవారం జరిగిన గ్రూప్ మ్యాచ్‌లో కొలంబియా జట్టు కాంగో డీఆర్‌ను 1-0 తేడాతో ఓడించింది. ఈ విజయంతో కొలంబియా తదుపరి రౌండ్‌కు దూసుకెళ్లింది. మ్యాచ్ మొత్తం ఇరు జట్లు గట్టి డిఫెన్స్‌తో ఆడగా, తొలి అర్ధభాగంలో గోల్స్ నమోదు కాలేదు. కొలంబియా తరపున జేమ్స్ రోడ్రిగెస్, లూయిస్ డియాజ్, జాన్ ఆరియాస్ వంటి స్టార్ ఆటగాళ్లు అనేక అవకాశాలు సృష్టించినప్పటికీ ఫలితం రాలేదు. అయితే 76వ నిమిషంలో మ్యాచ్ మలుపు తిరిగింది. జువాన్ క్వింటెరో అందించిన అద్భుత మైన పాస్‌ను డేనియల్ మునోజ్ వండర్ గోల్‌గా మలిచి జట్టుకు ఆధిక్యం అందించాడు. ఆ ఒక్క గోల్‌ను చివరి వరకు కాపాడు కున్న కొలంబియా విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయం తో కొలంబియా జట్టు నాకౌట్ దశలోకి ప్రవేశించి టోర్నమెం ట్‌లో తన ఆశలను మరింత బలపరుచుకుంది.

# ఆసియా క్రీడల ఎంపికపై మానికా బాత్రా ఆగ్రహం..

**న్యూఢిల్లీ, జూన్ 24, 2026 :**



భారత టేబుల్ టెన్నిస్ స్టార్ మానికా బాత్రా ఆసియా క్రీడల జట్టు ఎంపికపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. తనను జట్టు నుంచి తప్పించడానికి గల కారణాలను స్పష్టంగా వివరించకపోతే చట్టపరమైన చర్యలకు వెళ్తానని ఆమె టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాను హెచ్చరించింది. ఈ అంశంపై కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ జోక్యం చేసుకోవాలని మానికా మరోసారి విజ్ఞప్తి చేసింది. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా లేకపోవ డంపై ఆమె పలు ప్రశ్నలు లేవనెత్తింది. ర్యాంకింగ్స్ ఆధారంగా ఎంపిక జరిగిందా లేదా ఇతర ప్రమాణాలు పరిగణనలోకి తీసుకున్నారా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది. ప్రస్తుతం తాను ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 51వ స్థానంలో ఉన్నప్పటికీ, ఎంపికలో ఉపయోగించిన కాలవ్యవధి ఏమిటో తెలియ జేయలేదని ఆమె పేర్కొంది. గతంలో భారత్ కు పతకాలు అందించిన ఆటగాళ్లను కూడా ఈసారి పరిగణనలోకి తీసుకోక పోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని వ్యాఖ్యానించిం ది. టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో ఎంపిక నిర్ణయాలు ఎవరు తీసుకుంటారన్నదానిపై కూడా ఆమె సందేహాలు వ్యక్తం చేసింది. అంతర్జాతీయ స్థాయిలో అనుభవం ఉన్న మాజీ క్రీడాకారు లు ఈ నిర్ణయాల్లో ఎంతవరకు భాగస్వాము లు అవుతున్నారో స్పష్టం చేయాలని ఆమె కోరింది. జపాన్‌లో సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న ఆసియా క్రీడల నేపథ్యంలో ఈ వివాదం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్ల జోరు..

## గిల్ రెండో స్థానం, బుమ్రాకు అగ్రస్థానం

**దుబాయ్, జూన్ 24 :**




అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్లు అద్భుతంగా రాణించారు. వన్డే బ్యాటింగ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండో స్థానానికి ఎగబాకగా, టెస్ట్ బౌలింగ్‌లో జస్ప్రీత్ బుమ్రా అగ్రస్థానాన్ని న్యూజిలాండ్ పేసర్ మాట్ హెన్రీతో పంచుకున్నాడు. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో డారిల్ మిచెల్ మొదటి స్థానంలో కొనసాగుతుండగా, గిల్ కేవలం 24 రేటింగ్ పాయింట్ల తేడాతో రెండో స్థానంలో నిలిచాడు. ఆఫ్ఘనిస్థాన్‌పై జరిగిన సిరీస్‌లో గిల్ స్థిరమైన ప్రదర్శనతో మూడు స్థానాలు మెరుగుపరుచుకున్నాడు. అదే సిరీస్‌లో ఇషాన్ కిషన్ 21 స్థానాలు ఎగబాకి 43వ ర్యాంకుకు చేరడం విశేషం. భారత బౌలింగ్ విభాగంలో కూడా మెరుగుదల కనిపించింది. అర్ష్‌దీప్ సింగ్ 16 స్థానాలు ఎగబాకి 22వ ర్యాంకుకు చేరగా, ప్రసిద్ధ్ కృష్ణ 34 స్థానాలు మెరుగుపరుచుకుని 58వ స్థానంలో నిలిచాడు. వాషింగ్టన్ సుందర్ ఆల్‌రౌండర్ల జాబితాలో 71వ స్థానాన్ని సాధించాడు. టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టులో 11 వికెట్లు తీసిన మాట్ హెన్రీ, బుమ్రాతో కలిసి సంయుక్తంగా నంబర్ వన్ స్థానాన్ని పంచుకున్నాడు. 2024 నవంబర్ నుంచి ఒంటరిగా అగ్రస్థానంలో ఉన్న బుమ్రాకు ఇది కొత్త పోటీగా మారింది. టెస్ట్ బ్యాటింగ్‌లో ఇంగ్లండ్ స్టార్ జో రూట్ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని తిరిగి నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఇది ఆయన కెరీర్‌లో 12వసారి ఈ ఘనత సాధించడం గమనార్హం. టీ20 ర్యాంకింగ్స్‌లో కూడా మార్పులు చోటుచేసుకున్నాయి. ఆస్ట్రేలియా తరపున మిచెల్ మార్ష్ టాప్-10లోకి చేరగా, బంగ్లాదేశ్ బౌలర్ నసుమ్ అహ్మద్ ఏకంగా 27 స్థానాలు ఎగబాకి 11వ ర్యాంకుకు చేరాడు.

# ఐర్లాండ్ టూర్‌లో సంజూ శాంసన్ రికార్డు ఛేజ్..

**న్యూఢిల్లీ, జూన్ 24, 2026 :**




జట్టు ఐర్లాండ్ పర్యటన జూన్ 26 నుంచి ప్రారంభం కానుండగా, వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ ఓ అరుదైన రికార్డుపై దృష్టి పెట్టాడు. భారత్--ఐర్లాండ్ టీ20 సిరీస్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలవాలనే లక్ష్యంతో అతను ఈ సిరీస్‌కు సిద్ధమవుతున్నాడు. ప్రస్తుతం ఈ రికార్డు టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ పేరిట ఉంది. ఐర్లాండ్‌పై రోహిత్ శర్మ 4 టీ20 మ్యాచ్‌ల్లో 201 పరుగులు చేసి, 3 హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. అంతర్జాతీయ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్ శర్మ కారణంగా ఈ రికార్డును ఇప్పుడు సక్రియ ఆటగాళ్లు ఛేజ్ చేస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం సంజూ శాంసన్ ఈ రికార్డుకు అత్యంత చేరువలో ఉన్న ఆటగాడిగా ఉన్నాడు. ఐర్లాండ్‌పై ఇప్పటివరకు 3 టీ20 మ్యాచ్‌ల్లో 118 పరుగులు చేసిన సంజూకు, రోహిత్ శర్మ రికార్డును అధిగ మించడానికి కేవలం 84 పరుగు లు మాత్రమే అవసరం. అతని ప్రస్తుత ఫామ్ మరియు స్ట్రైక్ రేట్ దృష్ట్యా ఈ లక్ష్యం సాధ్యమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అదే సమయంలో ఐర్లాండ్ ఆటగా డు హ్యారీ టెక్టర్ కూడా ఈ జాబి తాలో ఉన్నప్పటికీ, అతనికి రికా ర్డు చేరుకోవడానికి ఇంకా పెద్ద పరుగుల లోటు ఉంది. ప్రస్తుతం భారత జట్టులో ఐర్లాండ్‌పై 100కి పైగా పరుగులు చేసిన ఏకైక ఆటగాడు సంజూ శాంసన్ మాత్రమే కావడం అతని అవకాశాలను మరింత బలపరుస్తోంది. ఈ రెండు మ్యాచ్‌ల్లో అతను మంచి ప్రదర్శన కనబరిస్తే, భారత్--ఐర్లాండ్ టీ20 సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కొత్త రికార్డు సృష్టించే అవకాశం ఉంది.

# స్టోక్స్--మెక్‌కల్లమ్ మధ్య విభేదాలపై క్లారిటీ

**న్యూఢిల్లీ, జూన్ 24, 2026 :**




ఇంగ్లండ్ టెస్టు జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్, ప్రధాన కోచ్ బ్రెండన్ మెక్‌కల్లమ్ మధ్య విభేదాలు ఉన్నాయంటూ కొంతకాలంగా వస్తున్న వార్తలకు తాజాగా స్పష్టత వచ్చింది. న్యూజిలాండ్‌తో మూడో టెస్టు ప్రారంభానికి ముందు మెక్‌కల్లమ్ ఈ అంశంపై స్పందిస్తూ, సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పాడు. స్టోక్స్ తనకు మంచి స్నేహితుడని, ఇద్దరి మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో తొలి టెస్టు అనంతరం జరిగిన ఓ ఘటన నేపథ్యంలో ఇద్దరి పేర్లు ప్రస్తావనకు రావడంతో ఈ చర్చ మరింత వేడెక్కింది. అయితే ఆ సంఘటనతో తమకు సంబంధం లేదని మెక్‌కల్లమ్ వివరించాడు. స్టోక్స్‌తో కలిసి ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నామని, జట్టు ప్రయోజనాలే తమకు ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ం2022లో ఇంగ్లండ్ టెస్టు జట్టు కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన మెక్‌కల్లమ్, స్టోక్స్‌తో కలిసి 'బజ్‌బాల్' అనే దూకుడైన ఆటతీరును ప్రవేశపెట్టి జట్టు ప్రదర్శనను పూర్తిగా మార్చారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య సమన్వయం కీలక పాత్ర పోషించింది. మరోవైపు నైట్‌క్లబ్ ఘటన నేపథ్యంలో గతంలో స్టోక్స్, పేసర్ అట్కిన్సన్‌పై రెండో టెస్టుకు వేటు పడింది. అయితే విచారణ అనంతరం వారికి క్లీన్‌చిట్ లభించడంతో స్టోక్స్ మూడో టెస్టుకు తిరిగి జట్టులో చేరాడు. సిరీస్ ప్రస్తుతం 1-1తో సమంగా ఉండగా, నిర్ణయాత్మక మూడో టెస్టు కోసం ఇంగ్లండ్ జట్టు సన్నద్ధమవుతోంది.



# మహిళా క్రికెటర్లకు ఐసీసీ కొత్త గైడ్‌లైన్స్‌పై సచిన్ టెండూల్కర్ హర్షం

**న్యూఢిల్లీ, జూన్ 24 :**

మహిళా క్రికెటర్ల కోసం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ప్రవేశపెట్టిన కొత్త మార్గదర్శకాలపై క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రసవానంతరం మహిళా క్రీడాకారిణులు మళ్లీ మైదానంలోకి తిరిగి రావడానికి ఈ నిబంధనలు పెద్ద ఊతమని ఆయన అభివర్ణించారు. మాతృత్వం మరియు వృత్తిగత కెరీర్‌ను సమన్వయం చేసుకునే అవకాశం కల్పించే విధంగా ఈ మార్గదర్శకాలు రూపొందించబడటం మహిళా క్రికెట్‌కు చారిత్రాత్మక అడుగుగా సచిన్ పేర్కొన్నారు. మహిళా క్రీడాకారిణులు తమ కుటుంబ బాధ్యతల కారణంగా కెరీర్‌ను మధ్యలో ఆపాల్సిన పరిస్థితి ఇకపై తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా 'రిటర్న్ టు ప్లే పోస్ట్-ప్రెగ్నెన్సీ గైడ్‌లైన్స్'ను విడుదల చేసింది. గర్భధారణకు ముందు, గర్భధారణ సమయంలో, ప్రసవం తర్వాత క్రీడాకారిణుల శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మొత్తం ఆరు దశల విధానాన్ని ఇందులో పొందుపరిచారు. ప్రపంచ క్రికెట్ చరిత్రలో మహిళా క్రీడాకారిణుల కోసం ఇలాంటి సమగ్ర విధానం తీసుకురావడం ఇదే మొదటిసారి. ఈ మార్గదర్శకాలు మహిళా క్రికెటర్లు దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని మాతృత్వం కారణంగా కోల్పోకూడదనే ఉద్దేశంతో రూపొందించ బడినట్లు ×జజ ఛైర్మన్ జై షా తెలిపారు. ఈ నిర్ణయం మహిళా క్రికెట్ అభివృద్ధికి కీలక మలుపు అవుతుందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.



# షోయబ్ అక్తర్ ఇంట విషాదం..

**ఇస్లామాబాద్, జూన్ 24 :**

పాకిస్థాన్ మాజీ క్రికెటర్, "రావల్పిండి ఎక్స్‌ప్రెస్"గా ప్రసిద్ధి చెందిన షోయబ్ అక్తర్ ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. ఆయన సోదరుడు షాహిద్ అక్తర్ మృతి చెందినట్లు పాకిస్థాన్ మీడియా వెల్లడించింది. ఈ విషయాన్ని షోయబ్ అక్తర్ స్వయంగా తన ఎక్స్ ఖాతాలో ధృవీకరించారు. తన సోదరుడు షాహిద్ అక్తర్ అల్లా వద్దకు చేరుకున్నారని పేర్కొంటూ భావోద్వేగ సందేశం పోస్ట్ చేశారు. అయితే ఆయన మృతికి గల కారణం ఇప్పటివరకు స్పష్టంగా తెలియరాలేదు. ఈ ఘటనపై క్రికెట్ అభిమానులు, మాజీ పాకిస్థాన్ క్రికెటర్లు సోషల్ మీడియాలో సంతాపం వ్యక్తం చేస్తున్నారు. మాజీ క్రికెటర్ రషీద్ లతీఫ్ కూడా షాహిద్ అక్తర్ మృతికి నివాళి అర్పించారు. ఆయన అంత్యక్రియలు హెచ్-8 శ్మశానవాటికలో నిర్వహించనున్నట్లు సమాచారం. గతంలో షోయబ్ అక్తర్ తల్లి కూడా మృతి చెందడంతో కుటుంబం మరోసారి విషాదంలో మునిగిపోయింది. ఇటీవల ఆయన క్రికెట్ పండిట్‌గా మారి టీ20 వరల్డ్ కప్ సహా పలు మ్యాచ్‌లపై తన విశ్లేషణలు, అభిప్రాయాలను పంచుకుంటూ వస్తున్నారు.

## 'వారణాసి' షూటింగ్‌కు బ్రేక్.. కుటుంబంతో మహేష్ వెకేషన్

**హైదరాబాద్, జూన్ 24 :**

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. పాన్ వరల్డ్ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న మహేష్ బాబు తాజాగా చిన్న విరామం తీసుకుని కుటుంబ సభ్యులతో కలిసి వెకేషన్‌కు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మహేష్ బాబు తన భార్య నమ్రత, కుమారుడు గౌతమ్, కుమార్తె సితారలతో కలిసి కనిపించారు. కుటుంబంతో కలిసి ఎయిర్‌పోర్ట్‌లో కనిపించిన వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో 'వారణాసి' షూటింగ్‌కు మహేష్ బాబు తాత్కాలికంగా బ్రేక్ ఇచ్చినట్లు స్పష్టమైంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం మహేష్ బాబు జూలై 1, 2026 నుంచి మళ్లీ 'వారణాసి' షూటింగ్‌లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. వరుసగా నెలల తరబడి షూటింగ్‌లో పాల్గొన్న అనంతరం కుటుంబంతో కొంత సమయం గడపాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇక ఈ చిత్రంలో మహేష్ బాబు పాత్రల గురించి వస్తున్న వార్తలు అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ సినిమాలో ఆయన 'రుద్ర' పాత్రలో కనిపించడమే కాకుండా, శ్రీరాముడి పాత్రలో కూడా ద్విపాత్రాభినయం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా యాక్షన్ ఎపిసోడ్లు, అడ్వెంచర్ సన్నివేశాలు సినిమా ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టాక్ వినిపిస్తోంది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక ఈ చిత్రంలో 'మందాకిని' పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండబోతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత కె.ఎల్. నారాయణ నిర్మిస్తుండగా, ఎస్ఎస్ కార్తికేయ కూడా నిర్మాణ బాధ్యతల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. సుమారు రూ.1300 కోట్లకు పైగా బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ప్రాజెక్టులలో ఒకటిగా నిలవనుంది. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి స్వరాలు సమకూరుస్తుండగా, కథను విజయేంద్ర ప్రసాద్ అందిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు దేవా కట్టా సంభాషణలు రాస్తున్నారు. రాజమౌళి విజన్‌కు అనుగుణంగా అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమా తెరకెక్కుతోంది.





ఫోక్ క్వీన్ నాగద ర్గకు

## వరుస ఆఫర్లు.. టాలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎంట్రీ

**హైదరాబాద్, జూన్ 24 :**

యూట్యూబ్ వేదికగా తెలంగాణ ఫోక్ డ్యాన్స్‌లతో గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ ఇప్పుడు వెండితెరపై తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతోంది. సోషల్ మీడియాలో భారీ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ఈ యువ నటి ఇప్పుడు వరుస సినిమా అవకాశాలతో బిజీగా మారింది. ఇప్పటికే తమిళంలో తెరకెక్కుతున్న 'లవ్ ఓ లవ్' చిత్రంలో కథానాయికగా నటిస్తున్న నాగదుర్గ, వెండితెరపై తన తొలి అడుగు వేసింది. దర్శకుడు మగేష్ రాజేంద్రన్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో పవిష్ నారాయణ్ సరసన ఆమె ఫీమేల్ లీడ్‌గా నటిస్తోంది. ఇది ఆమెకు తమిళ చిత్రసీమలో తొలి అవకాశం కావడం విశేషం. ఇక టాలీవుడ్‌లో కూడా నాగదుర్గకు పెద్ద అవకాశం దక్కినట్లు సమాచారం. సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాసు ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఓ గ్రామీణ కుటుంబ నేపథ్య కథలో ఆమె హీరోయిన్‌గా ఎంపికైనట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో నటుడు ప్రియదర్శి ప్రధాన పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. ఒకప్పుడు యూట్యూబ్‌లో ఫోక్ వీడియోలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నాగదుర్గ ఇప్పుడు వరుసగా సినిమాల్లో అవకాశాలు అందుకుంటూ వెండితెర వైపు వేగంగా అడుగులు వేస్తోంది. తెలంగాణ గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే పాత్రల్లో ఆమెనటన ఎలా ఉంటుందో నన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.



## సౌత్ ఇండస్ట్రీపై తమన్నా కామెంట్స్ వైరల్

**ముంబై, జూన్ 24 :**

మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా చేసిన తాజా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారి తీస్తున్నాయి. సౌత్ ఇండస్ట్రీ, బాలీవుడ్ మధ్య పని విధానంపై ఆమె చేసిన వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. తమన్నా మాట్లాడుతూ, బాలీవుడ్‌లో తాను ఏం చేయాలనుకుంటున్నదీ ఎంచుకునే స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుందని, కానీ సౌత్ ఇండస్ట్రీలో అలా ఉండదని వ్యాఖ్యానించింది. నటన లేదా గ్లామర్‌లో ఏదో ఒకదానిని మాత్రమే ఎంచుకునే అవకాశం బాలీవుడ్‌లో ఉంటే, సౌత్‌లో మాత్రం రెండింటినీ బ్యాలెన్స్ చేయాల్సి వస్తుందని ఆమె చెప్పినట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలు బయటకు వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. చాలామంది నెటిజన్లు దీనిపై స్పందిస్తూ, తమన్నాకు పేరు, గుర్తింపు, స్టార్‌డమ్, ఫ్యాన్ బేస్ అన్నీ ఎక్కువగా సౌత్ సినిమాల ద్వారానే వచ్చాయని గుర్తు చేస్తున్నారు. తెలుగు, తమిళ సినిమాల్లో స్టార్ హీరోల సరసన అవకాశాలు పొందిన ఆమె ఇప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైనది కాదని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఇక మరోవైపు కొందరు మాత్రం తమన్నా వ్యాఖ్యలను సమర్థిస్తూ, ఇండస్ట్రీల మధ్య పని విధానంలో తేడాలను మాత్రమే ఆమె చెప్పిందని వాదిస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చగా మారాయి.

విజయ్ పుట్టినరోజు విషయంలో ట్రోల్స్‌పై

## రజినీకాంత్ క్లారిటీ..

**చెన్నై, జూన్ 24 :**

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు సూపర్‌స్టార్ రజినీకాం త్ బహిరంగంగా పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పలేదంటూ సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై ఆయన స్పందించారు. చెన్నైలో జరిగిన తన కొత్త చిత్రం 'ధర్మన్' లాంచ్ కార్యక్రమంలో ఈ వివాదానికి రజినీకాంత్ స్పష్టత ఇచ్చారు. కార్యక్రమం అనంతరం మీడియా అడిగిన ప్రశ్నకు స్పందించిన ఆయన, తాము ఇప్పటికే వ్యక్తిగతంగా మాట్లాడుకున్నామని, ఈ విషయంపై బహిరంగ చర్చ అవసరం లేదని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న ట్రోల్స్‌కు ఇదే తన సమాధానమని రజినీకాంత్ పేర్కొన్నారు. జూన్ 22న విజయ్ 52వ పుట్టినరోజు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కమల్ హాసన్, కీర్తి సురేష్, ఖుష్బూ సుందర్, మోహన్‌లాల్, త్రిష తదితర ప్రముఖులు బహిరంగంగా శుభాకాంక్షలు తెలిపారు. అయితే రజినీకాంత్ స్పందించకపోవడంతో కొందరు నెటిజన్లు విమర్శలు చేయడం ప్రారంభించారు. గతంలో కూడా ఇలాంటి సందర్భాల్లో ఆయనపై ట్రోలింగ్ జరిగిన విషయాన్ని సోషల్ మీడియాలో గుర్తుచేస్తున్నారు.





## చరణ్‌పై చిరంజీవి భావోద్వేగ పోస్ట్.. తండ్రిగా గర్వంగా ఉందన్న మెగాస్టార్

**హైదరాబాద్, జూన్ 24 :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో రామ్ చరణ్‌కు లభించిన ప్రత్యేక గుర్తింపుపై మెగాస్టార్ చిరంజీవి భావోద్వేగంగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా చేసిన తన పోస్టులో కొడుకు సాధించిన విజయాన్ని చూసి తండ్రిగా ఎంత గర్వంగా ఉందో హృదయానికి హత్తుకునేలా వ్యక్తం చేశారు. చిరంజీవి తన పోస్టును సుమతీ శతకంలోని ప్రసిద్ధ పద్యంతో ప్రారంభించారు. "పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడే పుట్టదు, జనులా పుత్రుని గనుగొని పొగడగా, పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ" అంటూ రాసిన ఆయన, కొడుకు పుట్టడమే తండ్రికి అసలైన ఆనందం కాదని, సమాజంలో ఆ కొడుకు గొప్పతనాన్ని గుర్తించి ప్రశంసించినప్పుడే తండ్రికి నిజమైన సంతోషం కలుగుతుందని పేర్కొన్నారు. నిన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న కార్యక్రమంలో రామ్ చరణ్‌ను "న్యూ ఏజ్ మెగాస్టార్"గా సంబోధించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని చిరంజీవి తెలిపారు. ఇలాంటి ప్రతిష్ఠాత్మక వేదికలపై చరణ్‌కు లభిస్తున్న గౌరవం, గుర్తింపు చూస్తుంటే తండ్రిగా గర్వంగా ఉందన్నారు. రామ్ చరణ్ తన కృషి, అంకితభావం, నటనతో ప్రేక్షకుల అభిమానాన్ని మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా విశేషమైన గుర్తింపును కూడా సంపాదించుకున్నాడని చిరంజీవి ప్రశంసించారు. ఇక ముందు కూడా మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని పేర్కొన్నారు. చిరంజీవి చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మెగా అభిమానులతో పాటు సినీ అభిమానులు కూడా ఈ పోస్టును పెద్ద ఎత్తున షేర్ చేస్తూ రామ్ చరణ్‌కు అభినందనలు తెలియజేస్తున్నారు.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467